www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

గురువారం | 1-5-2025 | పేజీలు: 10+8 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 15

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం; తిథి: చవితి ఉ.11.24 తదుపరి పంచమి; నక్షత్రం: మృగశిర మ. 2.21 తదుపరి ఆర్ద్ర; వర్జ్యం: రా.10.18-11.48, దుర్ముహూర్తం: ఉ.10.05-10.56, మ.3.09-4.00, అమృతఘడియలు: ఉ.6.15-7.44, తె 3.36-5.06, రాహుకాలం: మ.1.30-3.00, సూర్యోదయం: 5.52, సూర్యాస్తమయం: 6.31 | సిద్దిపేట

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రుద్రనామస్మరణతో మార్మోగిన శతపత్రపురం


పూర్ణాహుతి జరుపుతున్న రుత్వికులు

చేర్యాల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలంలోని ఆకునూరు గ్రామం రుద్ర నామస్మరణతో మార్మోగింది. గ్రామంలోని శ్రీ భవానీ రుద్రేశ్వర ఆలయంలో ఐదురోజులుగా కొనసాగిన శ్రీరుద్ర సహిత శతచండీయాగం బుధవారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా ఆలయంలో విశేషపూజలు జరిపారు. రుత్విక్కులు శతచండీ పారాయణం, రుద్రాభిషేకం, శతచండీయాగం మహా పూర్ణాహుతి, కుమారీ, సుహాసినీ పూజలు నిర్వహించారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నాగపూరి రాజలింగం తదితరులు చివరిరోజు వేడుకల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

భూ భారతితో శాశ్వత పరిష్కారం

● రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కలెక్టర్ మనుచౌదరి


దౌల్తాబాద్‌లో భూభారతి చట్టంపై మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

దౌల్తాబాద్/జగదేవ్‌పూర్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): భూభారతి చట్టంతో రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కలెక్టర్ మనుచౌదరి అన్నారు. బుధవారం దౌల్తాబాద్ మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన భూ భారతి చట్టం అవగాహన సదస్సుకు బక్కి వెంకటయ్య, కలెక్టర్‌తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ రైతులకు, ప్రజలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం బక్కి వెంకటయ్య మాట్లాడారు. రైతులకు 2025 భూ భారతి చట్టంలో చక్కటి పరిష్కారం జరుగుతుందన్నారు. ఈ చట్టంపైన రైతులకు పూర్తిఅవగాహన కల్పించాలని తెలిపారు. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా 44వేల దరఖాస్తులు వచ్చాయని అర్హులైన వారికి భూమిపై పూర్తి హక్కు కల్పిస్తామని చెప్పారు. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసి ప్రజలకి పారదర్శకంగా జిల్లా స్థాయిలో అన్ని సమస్యలు పరిష్కారమయ్యేలా ఈ చట్టం ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సదానందం, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్ లింగమూర్తి, తహసీల్దార్ చంద్రశేఖర్‌రావు, ఎంపీడీవో వెంకటలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా పరిష్కారం

రైతుల సమస్యలు పారదర్శకంగా పరిష్కరించడానికి ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని

మిగతా 4వ పేజీలో..

బసవేశ్వర జయంతి వేడుకల్లో పాల్గొన్న నిర్మలాజగ్గారెడ్డి


సంగారెడ్డిలో బసవేశ్వర చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పిస్తున్న నిర్మలా జగ్గారెడ్డి

అందరూ బసవేశ్వరుని అడుగుజాడల్లో నడవాలి

టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం సంగారెడ్డిలో బసవేశ్వర జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి బైపాస్‌లోని బసవేశ్వరుని విగ్రహంతో పాటు ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బసవేశ్వరుని అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. బసవేశ్వరుడు చేసిన సంస్కరణలు నేటి తరం జనానికి, ప్రభుత్వాలకు ఆదర్శనీయంగా చిరస్థాయిగా నిలిచిపోతాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకుడు కిరణ్ గౌడ్, వీరశైవ లింగాయత్ ప్రతినిధులు నాయకోటి నవీన్, శివరాజ్, మల్లికార్జున, సంగమేశ్వర తదితరులు పాల్గొన్నారు.



బసవేశ్వర విగ్రహం వద్ద నిర్మలా జగ్గారెడ్డి, వీరశైవ లింగాయత్ ప్రతినిధులు

పదిలో పతనం

● అగ్రస్థానం నుంచి అట్టడుగుకు పడిపోయిన జిల్లా ● రాష్ట్రంలో 25వ స్థానం

తొమ్మిదేళ్లలో ఇదే చెత్త రికార్డు

జిల్లా వ్యాప్తంగా 91.79 శాతం మాత్రమే ఉత్తీర్ణత

మొక్కుబడి సమీక్షలు, పర్యవేక్షణ లోపమే కారణం

నిన్న ఇంటర్, నేడు ఎస్సెస్సీలో దారుణ ఫలితాలు

ప్రతి యేటా పదో తరగతి ఫలితాల్లో తొలి మూడు స్థానాల్లో కనిపించే సిద్దిపేట జిల్లా ఈ సారి 25వ స్థానానికి పడిపోయింది. తొమ్మిదేళ్ల కాలంలో ఇదే చెత్త రికార్డు కావడం గమనార్హం. పరీక్ష రాసిన విద్యార్థుల్లో 91.79 శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. గతేడాది నూటికి నూరు శాతం ఉత్తీర్ణతతో సత్తాచాటిన సర్కారు స్కూళ్లు ప్రస్తుతం డీలా పడ్డాయి. జిల్లా విద్యాధికారుల పర్యవేక్షణ లేకపోవడం, ఉన్నత స్థాయిలో సమీక్షలు నిర్వహించకనే ఇలాంటి ఫలితాలు వచ్చాయనే విమర్శలు నెలకొన్నాయి. నిన్న ఇంటర్, నేడు ఎస్సెస్సీ ఫలితాల్లో జిల్లా వెనుకబడటం ఆందోళనను కలిగిస్తోంది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, ఏప్రిల్ 30



సిద్దిపేటలోని ఇందిరానగర్ పాఠశాలలో సంబురాలు చేసుకుంటున్న విద్యార్థులు

నిన్న వెలువడిన పదోతరగతి వార్షిక ఫలితాలు తీవ్రంగా నిరాశపరిచాయి. 2016లో సిద్దిపేట జిల్లా ఏర్పాటైన నాటి నుంచి ఇలాంటి చేదు ఫలితాలు రాలేదు. గడిచిన నాలుగేళ్లలోనైతే ఏకంగా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో జిల్లా మెరిసింది. ఒకటో ర్యాంకు నుంచి మూడో ర్యాంకులోనే ఉండే జిల్లా ఒక్కసారిగా 25వ ర్యాంకుకు పడిపోవడం ముక్కున వేలేసుకునేలా చేసింది.

91.79 శాతమే ఉత్తీర్ణత

జిల్లావ్యాప్తంగా 14,144 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 7,117 మంది బాలురు, 6997 మంది బాలికలు ఉన్నారు. బాలురలో 6,434 మంది, బాలికల్లో 6,521 మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తంగా 12,955 మంది విద్యార్థులు మాత్రమే పాసయ్యారు. ప్రైవేట్ పాఠశాలలతో పోల్చితే ఈసారి ప్రభుత్వ పాఠశాలలు వెనుకబడినట్లుగా తెలుస్తోంది. గత ఏడాది వంద శాతం ఉత్తీర్ణతతో మెరిసిన చాలా పాఠశాలలు ప్రస్తుతం వెనుకబడ్డాయి.

పతనానికి కారణాలెన్నో..

పదోతరగతి ఫలితాల్లో రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచే సిద్దిపేట జిల్లా ర్యాంకు 25కు పడిపోవడం అనేక విమర్శలకు తావిస్తోంది. గతంలో హరీశ్‌రావు మంత్రిగా ఉన్న సమయంలో ఏడాదిలో రెండుమూడు సార్లు సమీక్షలు నిర్వహించేవారు. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు, జిల్లా అధికారులు, కలెక్టర్‌తో సహా చర్చించేవారు. గతేడాది కూడా రివ్యూలు చేశారు. ఈ దఫా జిల్లా అధికార యంత్రాంగం మొక్కుబడి సమీక్షలకే పరిమితమైంది. క్షేత్రస్థాయిలో విద్యార్థుల పరిస్థితిని గ్రహించలేకపోయారు. ప్రత్యేక తరగతుల విషయంలోనూ లోటుపాట్లు నెలకొన్నాయి. విద్యాశాఖ అధికారులు ఎంతసేపూ ప్రైవేట్ పాఠశాలలపై అజమాయిషీ చేయడం పైనే దృష్టి పెట్టారనే ఆరోపణలున్నాయి. ఫలితంగా సొంత పాఠశాలల్లో

మిగతా 4వ పేజీలో..

టెన్త్ ఫలితాల్లో సర్కార్ సత్తా 3

పనితీరులో మార్పు రావాలి

స్వచ్ఛ సిద్దిపేటకు అందరూ సహకరించాలి

విద్యుత్‌కు అంతరాయం కలిగితే 1912 కు కాల్ చేయాలి

మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, ఏప్రిల్ 30: సిద్దిపేట మున్సిపల్ అధికారుల పనితీరులో మార్పు రావాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు హెచ్చరించారు. బుధవారం సిద్దిపేటలోని మున్సిపల్ కార్యాలయంలో వివిధ అభివృద్ధి పనులపై కౌన్సిల్ సభ్యులు, అధికారులు, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సుతో కలిసి ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. కౌన్సిల్ సభ్యులు తమ తమ వార్డుల్లోని పలు సమస్యలను ఎమ్మెల్యే హరీశ్‌రావు దృష్టికి తీసుకొచ్చారు. పెండింగ్ పనులను యుద్ధప్రాతిపదికన పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు శానిటేషన్‌పై దృష్టి సారించడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో చెత్త పేరుకుపోయిందని, పట్టణంలోని బ్లాక్ స్పాట్‌లను తక్షణమే తొలగించాలని అధికారులకు సూచించారు. 2వ వార్డు నర్సాపూర్, 15వ వార్డు ఇమామ్‌బాద్, 1వ వార్డు లింగారెడ్డిపల్లి, ఇందిరమ్మ కాలనీలోని పెండింగ్ పనులను ప్రారంభించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ప్రతిరోజు ఉదయం 5 గంటల నుంచి ప్రతివార్డు అధికారి చెత్త బండితో తిరగాలని, మీరు చేసే పనిని కష్టపడి కాకుండా ఇష్టపడి చేయాలని సిద్దిపేట మున్సిపల్‌కు నూతనంగా వచ్చిన 32మంది వార్డు అధికారులకు సూచించారు. చెట్లను ఎవరూ నరకొద్దని, కేవలం కొమ్మలు మాత్రమే ట్రిమ్ చేయాలని హెచ్చరించారు. పట్టణంలో ఎక్కడైనా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే టోల్ ఫ్రీ నంబర్ 1912 కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. పట్టణంలోని శ్మశాన వాటికలో డబ్బులు అధికంగా వసూలు చేస్తున్నారని కొంతమంది కౌన్సిలర్లు హరీశ్‌రావు దృష్టికి తీసుకురాగా వారితో మున్సిపల్ చైర్‌పర్సన్, మున్సిపల్ కమిషనర్ మాట్లాడి సమస్యను తీర్చాలన్నారు. విధులలో నిర్లక్ష్యం వహిస్తే మున్సిపల్ అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవని ఘటుగా హెచ్చరించారు. ఈ సమావేశంలో పాలకవర్గం సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, పోలీసులు, విద్యుత్ తదితర అధికారులు పాల్గొన్నారు.



సమన్యాయం కోసం పోరాడిన యోధుడు

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కుల, మత, వర్గ, వర్ణ వివక్షత లేకుండా సమన్యాయం కోసం పోరాడిన మహనీయుడు విశ్వగురువు మహాత్మా బసవేశ్వరుడని మాజీమంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. బుధవారం పొన్నాల వద్ద జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విశ్వగురువు బసవేశ్వర 892వ జయంతి వేడుకలలో డీఆర్‌వో, వీరశైవ, లింగాయత్ సంఘాలతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా బసవేశ్వరుని చిత్రపటం వద్ద జ్యోతిప్రజ్వలన చేసి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీబీసీడీవో నాగరాజమ్మ, లింగాయత్ సంఘాల జిల్లా అధ్యక్షుడు, పట్టణ గౌరవాధ్యక్షుడు, పట్టణాధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యపై కినుక ఎందుకో?

● కొమురవెల్లిలో కస్తూర్బాకు అధునాతన వసతులతో భవనం

● అధికారుల నిర్లక్ష్యంతో ఇంటర్మీడియట్ విద్యకు దూరం

4



గోరంత అనుమతి.. కొండంత తవ్వకాలు

క్రషర్ బ్లాస్టింగ్‌తో కనిపించని వన్యప్రాణులు

బీడు భూములుగా మారుతున్న పంట పొలాలు

పట్టించుకోని మైనింగ్ అధికార యంత్రాంగం

3

కొత్త కార్డులు వచ్చేస్తున్నాయ్

● జిల్లాలో ఇప్పటి వరకు 1562 కార్డులు

● ఈ నెల నుంచే బియ్యం అందుకోనున్న లబ్ధిదారులు

● హర్షం వ్యక్తం చేస్తున్న కార్డు లబ్ధిదారులు



సిద్దిపేట కలెక్టరేట్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పేద లు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కొత్త రేషన్‌కార్డులు వచ్చేస్తున్నాయి. మీసేవా కేంద్రాల్లో కొత్త కా ర్డులు, కార్డుల్లో పేర్ల నమోదుకు దరఖాస్తు చేసుకోగా విచారణ చేపట్టిన సంబంధిత అధికారులు వారికి కార్డులు మంజూరుతో పాటు పాత కార్డుల్లో పేర్లు నమోదు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా నేటివరకు 1562 కొత్తకార్డులు మంజూరు కాగా 45, 262 మంది పేర్లను కార్డుల్లో చేర్చారు. అదనంగా పెరిగిన కార్డులు, యూనిట్లకు అనుగుణంగా మేలో బియ్యం కోటాను ఏప్రిల్ కంటే 265.947 మెట్రిక్ టన్నులు అధికంగా కేటాయించారు.

దరఖాస్తుల పరిశీలన

ప్రస్తుతం మీసేవా కేంద్రాల్లో వచ్చిన దరఖాస్తులపై మాత్రమే విచారణ చేపట్టిన అధికారులు అర్హులైన వారికి కార్డులు మంజూరు చేస్తున్నారు. ప్రజాపాలన, గ్రామ, వార్డుసభల్లో వచ్చిన దరఖాస్తులపై ప్రస్తుతానికి ఎలాంటి చర్యలు చేపట్టలేదు. జిల్లావ్యాప్తంగా రేషన్‌కార్డులు, కార్డుల్లో పేర్ల చేర్పునకు దాదాపు 50 వేలు పైగానే దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం. ప్రతీ మండలానికి ఒక యాప్ ఇచ్చి.. క్షేత్ర స్థాయిలో రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులు దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. వారు అర్హులా? కాదా? అనేది అక్కడే నిర్ధారించి యాప్‌లో నమోదు చేస్తున్నారు. పరిశీలన అనంతరం అర్హులైన వారందరికీ కొత్త రేషన్ కార్డులను మంజూరు చేయనున్నారు. దాదాపు ఎనిమిదేళ్ల తర్వాత కొత్త కార్డుల మంజూరు, పేర్లు నమోదుతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నెల	రేషన్ కార్డులు	సభ్యులు	బియ్యం కోట మెట్రిక్ టన్నులు
ఏప్రిల్	2,91,327	9,05,555	5,775.762
మే	2,92,889	9,50,824	6,041.707

అర్హులైన వారందరికీ రేషన్‌కార్డులు

అర్హులైన లబ్ధిదారులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేస్తాం. జిల్లాలో 1562 నూతన రేషన్ కార్డులు మంజూరయ్యాయి. వీరికి ఈ నెలలోనే రేషన్ బియ్యం అందించడం జరుగుతుంది. ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తులు క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నాం. అనంతరం అర్హులైన వారికి నూతన రేషన్ కార్డు మంజూరు చేస్తాం.

- తనూజ, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి, సిద్దిపేట

80 కిలోల ఎండుగంజాయి పట్టివేత



కారుతోపాటు గంజాయిని స్వాధీనంచేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

జహీరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి కర్ణాటకకు అక్రమంగా తీసుకెళ్తున్న 80కిలోల ఎండుగంజాయిని పోలీసులు పట్టుకున్నట్లు చిరాగ్‌పల్లి ఎస్ఐ.రాజేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం జహీరాబాద్ మండలంలోని చిరాగ్‌పల్లి సమీపంలోని మాడ్గి చౌరస్తావద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో చిరాగ్‌పల్లి మీదుగ కర్ణాటకకు వెళ్తున్న ఏపి28-డీఈ3257 నెంబరుగల ఇండికా కారును ఆపి తనిఖీ చేయగా డిక్కిలో 40 ఎండుగంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. అయితే మండలంలోని గోవింద్‌పూర్ గ్రామానికి చెందిన కారుడ్రైవర్ తిరుమలేష్ బగ్దల్‌లో ఉన్న వినోద్‌కు గంజాయిని తీసుకువెళ్తున్నాడు. తిరుమలేష్‌కు సమీప బంధువైన బీదర్‌పట్టణానికి చెందిన గుండప్ప రూ.50వేలు ఇస్తానని చెప్పడంతో అత్యాశకు పోయి కారులో గంజాయిని తీసుకెళ్తా పోలీసులకు దొరికాడు. దీంతో రూ.20లక్షలు విలువ చేసే 80కిలోల ఎండుగంజాయి ప్యాకెట్లను, కారును స్వాధీనం చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ.రాజేందర్‌రెడ్డి తెలిపారు

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

వేర్వేరు చోట్ల ఘటనలు

తూప్రాన్/ములుగు/మాసాయిపేట ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో బుధవారం రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనల్లో ముగ్గురు దుర్మరణం పాలయ్యారు.

తూప్రాన్‌లో

నర్సంపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం మాచిన్ పల్లి గ్రామానికి చెందిన సుంకే బాలకృష్ణ (24) తాపీ మేస్త్రీగా పనిచేసేవాడు. బాలకృష్ణ ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా తూప్రాన్ మండలం నర్సంపల్లి శివారులో ఎక్స్‌కావేటర్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బాలకృష్ణ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. తూప్రాన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ములుగులో



రాజు మృతదేహం

ట్రాక్టర్, మోటార్ సైకిల్ ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన కొత్తూరు గ్రామంలో జరిగింది. ములుగు మండల పరిధిలోని కొక్కొండ గ్రామానికి చెందిన కుమ్మరి రాజు(40) పెయింటింగ్ పని చేసేవాడు. తన వృత్తి నిమిత్తం మోటార్ సైకిల్ పై మేడ్చల్‌కి వెళ్లి వస్తున్నాడు. కొత్తూరు గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ట్రాలీ తన వాహనాన్ని ఢీకొట్టింది. రాజు తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. రాజుకి భార్య స్వరూప, కొడుకు కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు.

మాసాయిపేటలో



ఖలీల్ భాషా (ఫైల్)

బొమ్మారం చౌరస్తా వద్ద 44వ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. చేగుంట ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం అదిలాబాద్ జిల్లా ఇచ్చోడ గ్రామానికి చెందిన ఖలీల్ భాషా (38) తన మినీ వ్యాన్‌లో ట్రాన్స్ పోర్టు వ్యాపారం చేసేవాడు. బుధవారం బొమ్మారం చౌరస్తా వద్ద రోడ్డు పక్కనే గల డివైడర్‌ను ఢీకొని తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు

చేపలు పడుతున్న ఇద్దరి మధ్య వాగ్వాదం

మనోహరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఇంటి పక్కన చెరువులో చేపలు పడుతున్నాడని ఇద్దరి యువకుల మధ్య గొడవ జరిగింది. ఒకరి పై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు అయింది. ఎస్సై సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామంలోని చెరువు పక్కన హర్షగౌడ్ అనే వ్యక్తి ఇల్లు కలదు. అదే గ్రామానికి చెందిన కనిగిరి రాజు ఇంటి పక్కనే చేపలు పట్టేవాడు. దీంతో మంగళవారం సాయత్రం హర్షగౌడ్, కనిగిరి రాజు ఇద్దరి మధ్య మాట మాట పెరిగి, కనిగిరి రాజును హర్షగౌడ్ రాయితో కొట్టాడు. దీంతో కనిగిరి రాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు హర్షగౌడ్ పై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుభాష్‌గౌడ్ తెలిపారు.

నీట మునిగి వ్యక్తి మృతి

పాపన్నపేట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ నీట మునిగి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సంఘటన బుధవారం ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల ఆలయ సమీపంలో జరిగింది. సుమారు 55-60 ఏళ్ల వయస్సు ఉన్న గుర్తు తెలియని వ్యక్తి ఆలయం ముందు ఉన్న నదీపాయ వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తూ నీట మునిగాడు. అక్కడే ఉన్న స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు స్థానికుల సాయంతో మృతదేహాన్ని వెలికి తీసి పంచనామా నిమిత్తం మృతదేహాన్ని మెదక్ ఆస్పత్రికి పంపించారు. మద్యం మత్తులో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తూ నీట మునిగి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. సంబంధీకులు ఉంటే ఎస్సై శ్రీనివాస్ గౌడ్ 8712657920 సంప్రదించాలని సూచించారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



మృతి చెందిన గేదె

మనూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్ తగిలి పాడి గేదె మృతి చెందింది. ఈ సంఘటన బుధవారం మనూరు మండలం అతిమ్యాల్‌లో జరిగింది. గ్రామానికి చెందిన నర్సింహారెడ్డి పాడి గేదెను బుధవారం ఉదయం మేత కోసం తీసుకెళ్లగా గ్రామ శివారులోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షాక్ తగిలి పాడి గేదె అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. దాని విలువ రూ.80 వేలు ఉంటుందని, ప్రభుత్వం వారికి ఆర్థిక సాయం అందజేసి ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

మనువాదంపై పోరాటమే మహనీయులకు నివాళి

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మనువాదంపై పోరాటమే మహనీయులకు నిజమైన నివాళి అని కుల వివక్ష పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు, బహుజన ప్రజా వాగ్గేయకారుడు ఏపూరి సోమన్న, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బీరయ్య యాదవ్ అన్నారు. మహాత్మా జ్యోతిబాఫూలే, డా. బీఆర్. అంబేడ్కర్ జన జాతర సభ సందర్భంగా బుధవారం సంగారెడ్డిలో కేవీపీఎస్ నాయకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో వారు మాట్లాడారు. దేశంలో ఫూలే, అంబేద్కర్ లాంటి మహనీయులను ఒక కులానికి పరిమితం చేయడం ద్వారా వారిని అవమానించడమేనన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రెండు తలల పాములా దేశ ప్రజలపై విషం చిమ్ముతుందన్నారు.


భార్గవి(583)
ములుగు
గురుకుల పాఠశాల


పరశురాం(582)
కంగ్టి ఎస్టీ బాలుర
గురుకుల స్కూల్


శ్రీలేఖ(581)
బాలికల ఉన్నత
పాఠశాల, ఖేడ్


జాదవ్ బబ్లూ(581)
గిరిజన గురుకుల
పాఠశాల, ఖేడ్


లాస్య(576)
మంథనీ పాఠశాల,
పెద్దశంకరంపేట


ప్రసాద్ (576)
ఐడీఏబొల్లారం
ఆదర్శ పాఠశాల


నీతు శ్రీ(576)
జడ్పీహెచ్ఎస్
నారాయణఖేడ్


హరీష్
దుబ్బాక మైనార్టీ
పాఠశాల


కె. రాజేశ్వరి
మడూర్ హైస్కూల్,
చిన్నశంకరంపేట


కార్తీక (570)
ఐడీఏబొల్లారం
ఆదర్శ పాఠశాల

టెన్త్ ఫలితాల్లో సర్కార్ సత్తా

పదోతరగతి ఫలితాల్లో ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. ప్రైవేటుకు దీటుగా ఉత్తమ మార్కులు సాధించి ఔరా అనిపించారు. చాలావరకు సర్కార్ బడులు వందశాతం ఉత్తీర్ణత సాధించాయి. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు అభినందించారు.

-న్యూస్ నెట్‌వర్క్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి)


సంతోషం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

- గుమ్మడిదల మండలంలోని ఏడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో కలిపి 97 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ఎంఈవో రాంబాబు తెలిపారు. 270 మంది విద్యార్థులకు 263 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు.
- హత్నూర మండలంలో 841 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 840 మంది ఉత్తీర్ణులయ్యారు.
- నారాయణఖేడ్ మండలంలో 941 మందికి 934 మంది ఉత్తీర్ణత సాధించారు.
- వెల్దుర్తి మండలంలో 384 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, 379 మంది పాసయ్యారు.
- రామచంద్రాపురం జిల్లా పరిషత్ పాఠశాలలో 185 మంది విద్యార్థులకు గాను 184 మంది ఉత్తీర్ణత సాధించారు. తెల్లాపూర్ పురపాలక పరిధి ముత్తంగి పాఠశాలలో 37కి 36 మంది, ఘన్‌పూర్‌లో 17కు 15 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.
- చేగుంటలోని బోనాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 18 మందికి 17 మంది, చందాయిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 82 మందికి 79 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.
- నర్సాపూర్ మండలంలో 777 మంది విద్యార్థులకు గాను 720 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో తారాసింగ్ పేర్కొన్నారు.
- మెదక్ మండల వ్యాప్తంగా 1384 మంది పరీక్షలు రాయగా 1350(97.54 శాతం) మంది ఉత్తీర్ణులైనట్లు ఎంఈవో నీలకంఠం తెలిపారు.
- అల్లాదుర్గం మండలంలోని చిల్వర్ పాఠశాలలో 98 శాతం, ముస్లాపూర్‌లో 98.2 శాతం, అల్లాదుర్గం బాలికల ఉన్నత పాఠశాలలో 97.8 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో ధనుంజయగౌడ్ తెలిపారు.
- చిలప్‌చెడ్ మండలంలో 263 మంది విద్యార్థులకు 258 మంది ఉత్తీర్ణత సాధించారు.
- చిన్నశంకరంపేట మండల వ్యాప్తంగా 428 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 415 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.
- హవేళిఘణపూర్ మండలంలలో 541 మంది విద్యార్థులకు గాను 506 మంది పాసయ్యారు.
- రామాయంపేట మండలంలో 736 మంది విద్యార్థులు పరీక్షలకు రాయగా, 710 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.
- పాపన్నపేట మండలంలో 515 మంది విద్యార్థులకు గాను 508 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మండల కేంద్రమైన పాపన్నపేట ఉన్నత పాఠశాలలో 104 మంది విద్యార్థులకు 102 మంది విద్యార్థులు (98.07 శాతం) ఉత్తీర్ణత సాధించారు.
- తొగుట మండలంలో 254 మందికి 241 మంది ఉత్తీర్ణత సాధించారు.
- చిన్నకోడూరు మండలంలో 391 మందికి 367 మంది విద్యార్థులు (93.86 శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో యాదవరెడ్డి తెలిపారు.
- నంగునూరు మండలంలో 368 మంది విద్యార్థులు హాజరు కాగా 360 మంది ఉత్తీర్ణులయ్యారు.
- గజ్వేల్ మండల పరిధిలో పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో 83.34 శాతం ఉత్తీర్ణతను సాధించినట్లు గజ్వేల్ మండల విద్యాధికారి వై. కృష్ణ తెలిపారు.
- కొండపాక మండలంలోని 12 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 397 మంది పరీక్షలు రాయగా, 389 మంది ఉత్తీర్ణత సాధించారు.
- మర్కుక్ మండల పరిధిలోని నాలుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒక కస్తూర్బాలో మొత్తం కలిపి 242 మంది పరీక్షకు హాజయ్యారని, ఇందులో 199 మంది విద్యార్థులు పాసైనట్లు మండల విద్యాధికారి వెంకట్‌రాములు తెలిపారు.
- బెజ్జంకి మండలంలో 97.71 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 349 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 341 మంది ఉత్తీర్ణత సాధించారు.
- హుస్నాబాద్ మండలంలో 99.03 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.
- శివ్వంపేట మండంలో మొత్తం 514 మందికి 486 మంది ఉత్తీర్ణత సాధించారు.
- సిద్ది జిల్లాలోని 22 కేజీబీవీలకు గానూ 10 పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణులయ్యారు. మొత్తంగా 94.77 శాతం ఉత్తిర్ణత సాధించారు. పట్టణంలోని తెలంగాణ మైనార్టీ స్కూల్ 44 మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా 42 మంది పాస్ అయ్యారు. సిద్దిపేట ప్రభుత్వ ఉన్నత నూతన పాఠశాలలో 57 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 53 మంది ఉత్తిర్ణత సాధించారు. ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాలలో మాథ్స్‌లో ముగ్గురు విద్యార్థులు 100 కు వంద మార్కులు సాధించారు.

ఈ మండలాల్లో అందరూ పాస్

వట్‌పల్లి మండలంలో 255 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాయగా అందరూ పాసైనట్లు ఎంఈవో గోవింద్ రెడ్డి తెలిపారు. కంగ్టి మండలంలో మొత్తం 350 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా మొత్తం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని మండల విద్యాధికారి రహీమోద్దిన్ తెలిపారు. అదేవిధంగా కొండాపూర్ మండలంలో 626 మంది విద్యార్థులకు 626 మంది, మద్దూరు మండలంలో 204 మందికి 204 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

వందశాతం ఉత్తీర్ణత శాతం సాధించిన ప్రభుత్వ బడులివే

ఐడీఏబొల్లారంలోని ఆదర్శ పాఠశాల, జిన్నారం ఎస్టీ గురుకుల, తెల్లాపూర్ ప్రభుత్వ పాఠశాల, నారాయణఖేడ్ మండలంలోని సంజీవన్‌రావుపేట, అబ్బెంద, సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల, చాప్టా.కె, హన్మంత్‌రావుపేట, అనంత్‌సాగర్, జడ్పీ ఉన్నత, కస్తూర్బా బాలికల విద్యాలయం, మైనార్టీ గురుకుల, జ్యోతిబాపూలే, తెలంగాణ మినీ గురుకుల, ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలు వందశాతం సాధించాయి.

నాగల్‌గిద్ద మండల పరిధిలోని మోర్గి మోడల్ కళాశాల, జడ్పీ ఉన్నత, నాగల్‌గిద్ద, కారముంగి, కరస్‌గుత్తి ఉన్నత పాఠశాలు, చేగుంట, వడియారం, మక్కరాజుపేట, ఇబ్రహీంపూర్, రెడ్డిపల్లి, కరీంనగర్ జడ్పీహెచ్ఎస్‌లు, చేగుంట ఆదర్శ, రెడ్డిపల్లి కస్తూర్బా, చేగుంట గిరిజన గురుకుల పాఠశాలలు, రేగోడు కస్తూర్బా బాలికల విద్యాలయం శతశాతం ఫలితాలు సాధించాయి.

అలాగే పెద్దశంకరంపేట మండల పరిధిలోని చీలపల్లి, మూసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా గాంధీ విద్యాలయం మోడల్ స్కూల్ పాఠశాల, అల్లాదుర్గం మండలంలోని గడిపెద్దాపూర్, అల్లాదుర్గం జిల్లా పరిషత్(బాలుర) ఉన్నత పాఠశాల, చిలప్‌చెడ్ మండలంలోని చండూరు, చిట్కుల్, గౌతాపూర్, ఫైజాబాద్, చిలప్‌చెడ్ ప్రభుత్వ పాఠశాలలు, చిన్నశంకరంపేట మండలంలోని సూరారం హైస్కూల్, పాపన్నపేట మండలంలో కుర్తివాడ, కేజీబీవీ, యూసఫ్‌పేట, మల్లంపేట, కొడుపాక ప్రభుత్వ పాఠశాలలు, చిన్నకోడూరు మండలంలో 9 ప్రభుత్వ పాఠశాలలు, నంగునూరు మండలంలోని మగ్దుంపూర్, అంక్షాపూర్, రాజగోపాలపేట, నర్మెటలోని కేజీబీవీ, అక్కెనపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు.

చేర్యాల మండలంలోని ముస్త్యాల మోడల్ స్కూల్, కస్తూర్బా, అర్జునపట్ల, కడవేరుగు, తాడూరు, వీరన్నపేట, గుర్జకుంట, పెద్దమ్మగడ్డ జడ్పీఎస్ఎస్ బాలుర, పోతిరెడ్డిపల్లి-పెద్దరాజుపేట జడ్పీఎస్ఎస్‌లు, కొండపాక మండలంలోని కొండపాక మర్పడగ, బందారం, అంకిరెడ్డిపల్లి, తిమ్మారెడ్డిపల్లి, ఖమ్మంపల్లి, కొండపాక కేజీబీవీ, కొండపాక మోడల్ స్కూల్, ధూళిమిట్ట, బైరాన్‌పల్లి, కూటిగల్ ఉన్నత పాఠశాలలు, మద్దూరు మండలంలోని కస్తూర్బా పాఠశాల, శివ్వంపేట మండంలోని పాంబండ, పెద్దగొట్టిముక్కుల, రత్నాపూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించారు.

సంగారెడ్డి జిల్లా టాపర్‌గా కంకోల్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని

● 590 మార్కులు సాధించిన వర్శిక



మునిపల్లి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : పదోతరగతి ఫలితాల్లో సంగారెడ్డి జిల్లా టాపర్‌గా ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని సత్తా చాటింది. హైదరాబాద్‌లోని జగద్గిర్‌గుట్టకు చెందిన గడ్డం వసంత- వరప్రసాద్‌ల కూతురు గడ్డం వర్శిక మునిపల్లి మండలం కంకోల్ లో తన మేన మామ వద్ద ఉంటూ స్థానిక జడ్పీహెచ్ఎస్‌లో చదువుకుంటున్నది. 600 మార్కులకు 590 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలువడంతో ఆమెకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

రాష్ట్ర మైనార్టీ గురుకులాల టాపర్‌గా రిషిత



జోగిపేట, ఏప్రిల్30(ఆంధ్రజ్యోతి): అందోలు మైనార్టీ గురుకుల విద్యార్థిని మంగలి రిషిత పదో తరగతి పరీక్షల్లో సత్తా చాటింది. 600 మార్కులకు గానూ 586 మార్కులు సాధించి రాష్ట్రంలోని మైనార్టీ గురుకులాల్లోనే టాపర్‌గా నిలిచింది. రిషితను ఎంఈవో బండి క్రిష్ణ, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ అభినందించారు.


ఐరన్ స్క్రాప్ వేలం నిర్వహిస్తున్న జైళ్లశాఖ డీఐజీ శ్రీనివాస్

సెంట్రల్ జైల్లో ఐరన్ స్క్రాప్ వేలం

● హాజరైన జైళ్లశాఖ డీఐజీ శ్రీనివాస్

కంది, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి సెంట్రల్ జైల్లో జైళ్లశాఖ డీఐజీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం ఐరన్ స్క్రాప్‌కు వేలంపాట నిర్వహించారు. జైల్లోని స్టీల్ ఫ్యాక్టరీలో ఐరన్ స్క్రాప్ 5.6 టన్నులు, 50 కిలోల ప్లాస్టిక్ స్క్రాప్ ఉంది. జిల్లా నలుమూలల నుంచి స్క్రాప్‌ను కొనే 70 మంది వ్యాపారస్థులు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొన్నారు. అందులో నుంచి ఎం.డి. అబ్దుల్ హనీఫ్ అనే వర్తకుడు దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా జైళ్లశాఖ డీఐజీ శ్రీనివాస్ మాట్లాడతూ, ఈ ఐరన్, ప్లాస్టిక్ స్క్రాప్ ద్వారా వచ్చిన ఆదాయన్ని జైళ్ల శాఖ సంస్కరణలకు ఉపయోగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జైలు పర్యవేక్షణ అధికారి సంతోష్ కుమార్ రాయ్, జైలర్లు, డిప్యూటీ జైలర్లు, జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో గురుకుల విద్యార్థిని సత్తా



మునిపల్లి, ఏప్రిల్30 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లాలోని మందమర్రి సింగరేణి స్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించిన 54వ రాష్ట్ర సీనియర్ మహిళల హ్యాండ్ బాల్ టోర్నమెంట్‌లో మునిపల్లి మండలం బుదేరా చౌరస్తాలో గల గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని బి. కల్పన ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకొని సత్తా చాటారు. ఈ సందర్భంగా కల్పనను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ రమాదేవి, అధ్యాపక బృందం అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

అర్హత మేరకే నియామకాలు చేపట్టాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి మెడికల్ కళాశాలలో సిబ్బందిని అర్హత మేరకే నియామకాలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేటు ఏజెన్సీకి అప్పటించి వారి ఇష్టానుసారం కళాశాల, ఆసుపత్రి సిబ్బందిని నియమించడం సరైంది కాదన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని అర్హత గలవారిని మాత్రమే నియమించేలా చూడాలన్నారు. అదేవిధంగా మేడే సందర్భంగా గురువారం నిర్వహించే ప్రదర్శనలో అన్ని వర్గాల కార్మికులు భారీగా తరలివచ్చి మేడేను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మాణిక్యం, నర్సింలు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే . ధాన్యం విక్రయించాలి



మెదక్/నర్సాపూర్/అల్లాదుర్గం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని మెదక్ ఆర్డీవో రమాదేవి తెలిపారు. మండలంలోని ముత్తాయికోట ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తసీల్దార్ సింధురేణుక, నిర్వాహకులు పాల్గొన్నారు. నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి సమీపంలోని వెంకటేశ్వర మిల్లును ఆర్డీవో మహిపాల్ తహసీల్దార్ శ్రీనివాస్‌తో కలిసి సందర్శించి, మిల్లర్లకు పలు సూచనలు చేశారు. అలాగే నర్సాపూర్ మండలంలోని బ్రాహ్మణపల్లి, తుజాల్‌పూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రాలను డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్‌రావు పరిశీలించారు. అల్లాదుర్గం మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ మల్లయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొప్పుల శేషారెడ్డి, నాయకులు సుభాష్‌రావు దేశ్‌పాండే, కొంక శ్రీశైలంతో కలిసి ప్రారంభించారు.

జేఎన్టీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమ్మె విరమణ


అసిస్టెంట్ ప్రొఫెసర్లతో సమ్మెను విరమింపజేస్తున్న ప్రిన్సిపాల్ నరసింహ

పుల్‌కల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు సమ్మెను బుధవారం విరమింపజేశారు. గడిచిన 24 రోజులుగా వివిధ రూపాల్లో శాంతియుతంగా ఆందోళన చేస్తూ.. 12 రోజులుగా నిరవధిక సమ్మెకు దిగారు. అయితే, రెండు, మూడు రోజులుగా ప్రభుత్వంలోని పెద్దలు, ఇతర అధికారులతో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు సంప్రదింపులు జరిపారు. సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సమస్యలు వివరించి వాటి పరిష్కారానికి హామీ తీసుకుంటామని చెప్పడంతో నిరవధిక సమ్మెను విరమింపజేశారు. ఇందులో భాగంగానే సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ కళాశాల ప్రధాన గేటు పక్కన గల సమ్మె శిబిరం వద్దకు ప్రిన్సిపాల్ జి.నరసింహ, వైస్ ప్రిన్సిపాల్ రాఘవేందర్‌రావులు చేరుకుని వారికి తేనీరు అందజేసి సమ్మెను విరమింపజేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ల డిమాండ్ల పరిష్కారం పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని, త్వరలోనే సమస్యలు ఒక కొలిక్కి వస్తాయని ప్రిన్సిపాల్ నరసింహ తెలిపారు. కాంట్రాక్టు అధ్యాపకుల జేఏసీ రాష్ట్ర కో ఆర్డినేట్ కమిటీ సూచనల మేరకు సమ్మెను విరమింపజేస్తున్నట్లు ప్రకటించారు.

తొలిప్రయత్నంలోనే జడ్జిగా సాహితి


తల్లిదండ్రులతో మల్యాల సాహితి

నంగునూరు, ఏప్రిల్ 30 : సిద్దిపేట జిల్లా నంగునూరుకు చెందిన మల్యాల అన్నపూర్ణ, రాజు దంపతుల పెద్దకూతురు మల్యాల సాహితి మొదటి ప్రయత్నంలోనే జడ్జిగా ఎంపికైంది. సాహితీ ఒకటో తరగతి నుంచి పదోతరగతి వరకు సిద్దిపేట గౌతమ్ మోడల్ స్కూల్‌లో విద్యను అభ్యసించింది. హైదరాబాదులోని ఎన్టీఆర్ జూనియర్ కాలేజీలో ఇంటర్ పూర్తి చేసి, బీ బీ ఏఎల్ ఎల్ బి బెంగుళూరులోని రేవా యూనివర్సిటీలో లా విద్య పూర్తి చేసింది. ఆరు నెలల క్రితం హైకోర్టు ఇచ్చిన నోటిఫికేషన్‌లో సాహితి దరఖాస్తు చేసుకుని జడ్జి పోస్ట్ కోసం రాత పరీక్షలకు హాజరైంది. రెండు రోజుల క్రితం జరిగిన ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయి నేరుగా జడ్జిగా ఎంపికైంది. సాహితి ఎంపిక పట్ల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. మారుమూల ప్రాంతానికి చెందిన సాహితి జడ్జిగా ఎంపిక కావడం పట్ల గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.



గోరంత అనుమతి.. కొండంత తవ్వకాలు

క్రషర్ బ్లాస్టింగ్‌లతో కనిపించని వన్యప్రాణులు

- **బీడు భూములుగా పంట పొలాలు**
- **రాంపూర్‌లో ఇళ్లకు పగుళ్లు**
- **పట్టించుకోని సంబంధిత అధికారులు**

కొల్చారం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్ గ్రామంలో 2018లో జాతీయ రహదారి నిర్మాణం కోసం క్రషర్‌ను ఏర్పాటు చేశారు. దానికి సంబంధించి ప్రభుత్వ భూమి 373 సర్వే నెంబర్‌లో ఎస్ఎల్ఎమ్ఐ కంపెనీకి మూడు హెక్టార్లు అనుమతి ఇచ్చారు. కానీ దానికి మించి కంకరను తవ్వేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అటవీ ప్రాంతానికి అనుకొని తవ్వకాలు జరపడంతో జంతువులు వేరే ప్రాంతాలకు తరలి వెళ్లిపోతున్నాయని వాపోతున్నారు. అంతేకాకుండా అక్రమ తవ్వకాలతో ఆహ్లాదకరమైన వాతావరణం, పచ్చని పంట పొలాలు నాశనమవుతున్నాయి. ముఖ్యంగా క్రషర్ల బ్లాస్టింగ్‌లతో గ్రామంలోని ఇళ్లు పగుళ్లు ఏర్పడి శిథిలావస్థకు చేరుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుట్టను తవ్వినా అధికారులు పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ పనుల పేరిట ప్రైవేటుకు అమ్మకాలు జరుపుతున్నారు. లారీలకు ఎలాంటి వే బిల్లులు లేకుండానే అమ్మకాలు జరగడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూడు హెక్టార్లు అని చెప్పి 12 హెక్టార్ల ప్రభుత్వ భూములను వాడుకుంటున్నారు. ఈ విషయమై మైనింగ్ అధికారిని వివరణ కోరగా అనుమతి ఇచ్చిన దానికంటే ఎక్కువగా తవ్వకాలు జరిపితే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలి



గ్రామంలో సన్నకారు రైతులం ఉన్నాం. ఈ బ్లాస్టింగ్ వల్ల బోర్లు, మోటర్లు కిందికి పడిపోవడంతో ఎంతో నష్టపోతున్నాం. పంట పొలాలపై దుమ్ము, ధూళి రావడంతో దిగుబడి తక్కువ వస్తుంది. గతంలో ఎన్నో మార్లు విన్నవించినా ఎస్ఎల్ఎమ్ఐ కంపెనీ యజమాని పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ తవ్వకాలను అరికట్టాలి.

-రైతు యాదగిరి


తవ్విన గుట్ట


ఇంటి స్లాబ్‌కు పగుళ్లు

ఇంటర్ విద్యపై కినుక ఎందుకో?

- కొమురవెల్లిలో కస్తూర్బాకు అధునాతన వసతులతో భవనం
- అధికారుల నిర్లక్ష్యంతో ఇంటర్మీడియట్ విద్యకు దూరం
- దూళిమిట్ట కేజీబీవీని సైతం ఇదే భవనంలో కొనసాగించడంతో గందరగోళం
- కొమురవెల్లి కస్తూర్బాను ఇంటర్‌కు అప్‌గ్రేడ్ చేసి దూళిమిట్టకు మరో భవనాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్


కొమురవెల్లిలో కస్తూర్బా అధునాతన భవనం

చేర్యాల, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండలకేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో ఇంటర్ విద్యను అందుబాటులోకి తీసుకురావడంలో సంబంధిత విద్యాశాఖాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో అన్యాయం జరుగుతుందని మండల విద్యార్థులు వాపోతున్నారు. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పలు కస్తూర్బా పాఠశాలల్లో ఇంటర్ విద్య ప్రారంభించేందుకు సన్నాహకాలు చేస్తున్న క్రమం లో సిద్దిపేట జిల్లా నుంచి అందించే ప్రతిపాదనల్లో కొమురవెల్లి కస్తూర్బాకు ప్రాధాన్యత కల్పించాలని వేడుకుంటున్నారు. ఈ విషయమై విద్యాశాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చిత్తశుద్ధి వహించాలని కోరుతున్నారు. వివరాల్లోకి వెళ్తే..

ఇంటర్ ప్రతిపాదనను పరిశీలిస్తాం

కొమురవెల్లి కస్తూర్బా భవనంలో దూళిమిట్ట కస్తూర్బా కొనసాగుతుంది. జిల్లావ్యాప్తంగా రెండు కస్తూర్బాలను ఇంటర్‌కు ప్రతిపాదించేందుకు సన్నాహకాలు చేస్తున్నాం. కొమురవెల్లి కస్తూర్బా ప్రతిపాదన విషయాన్ని పరిశీలిస్తాం.

- శ్రీనివాస్‌రెడ్డి, డీఈవో

ఎనిమిదేళ్ల క్రితం మంజూరైనా..

గత ప్రభుత్వం ఉమ్మడి చేర్యాల మండలంలో అంతర్భాగమైన కొమురవెల్లిని 2016లో నూతన మండలంగా ఏర్పాటు చేసింది. దీంతో 2017లో కస్తూర్బాను మంజూరు చేశారు. సొంత భవనం లేకపోవడంతో రాంసాగర్‌దారిలోని కురుమసత్ర భవనంలో పలు గదులు అద్దెకు తీసుకుని చాన్నాళ్లపాటు అరకొర వసతుల మధ్య కాలం వెళ్లదీసినప్పటికీ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. దీంతో అప్పటి కలెక్టర్ పి.వెంకట్రామారెడ్డి ప్రత్యేక చొరవ వహించి రాజీవ్ రహదారికి చేరువనగల ప్రభుత్వభూమిని కేటాయించడం, తద్వారా సుమారు రూ.3కోట్లు నిధులు మంజూరు కావడంతో భవిష్యత్ అవసరాలకు సరిపడా అధునాతన భవనాన్ని నిర్మించారు. ప్రస్తుతం ఇందులో 6 నుంచి 10వ తరగతి వరకు 233 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అంతేకాకుండా ఇంటర్మీడియట్ విద్యార్థులకు సరిపడా వసతులు కూడా అందుబాటులోఉన్నాయి. కొమురవెల్లి మండల కేంద్రంగా ఏర్పడి ఎనిమిదేళ్లు గడిచినా స్థానికంగా జూనియర్ కళాశాలలు లేక పొరుగు ప్రాంతాలకు వెళ్లి ఇంటర్ చదువుకుంటున్నారు. దీంతో వ్యయప్రయాసలతో పాటు తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నారు.

'దూళిమిట్ట' కొనసాగింపుతో..

చేర్యాల నుంచి కొమురవెల్లిని విడదీసిన మాదిరిగా ఉమ్మడి మద్దూరు మండలం నుంచి వేరుచేసి దూళిమిట్టను కూడా మండలకేంద్రంగా ఏర్పాటు చేశారు. దీంతో అక్కడ కూడా సుమారు రెండేళ్ల క్రితం కస్తూర్బాను మంజూరు చేయగా, కొద్దిరోజుల పాటు మద్దూరు మండలకేంద్రంలో కొనసాగించారు. దూళిమిట్ట మండలకేంద్రంలోనే నిర్వహించాల్సి ఉన్నప్పటికీ అక్కడ మౌలిక వసతులకల్పనలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలమయ్యారు. తద్వారా కొమురవెల్లి కస్తూర్బా అధునాతన భవనంపై దృష్టి సారించారు. ఇంటర్మీడియట్‌కు అవసరపడే భవనం పైఅంతస్తులోని 5గదులను దూళిమిట్ట కస్తూర్బాకు కేటాయించి కొనసాగించి చేతులు దులుపుకున్నారు. అయితే కొమురవెల్లిలో కస్తూర్బా భవనం దూళిమిట్ట నుంచి సుమారు 30 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో ఆ మండలానికి సంబంధించిన అడ్మిషన్లు అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఒకే భవనంలో రెండు కస్తూర్బా పాఠశాలలు కొనసాగిస్తుండటంతో గందరగోళానికి గురవుతున్నారు.

విద్యాశాఖ అధికారుల తీరుతో..

ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా కస్తూర్బాలలో ఇంటర్ విద్య అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టింది. తద్వారా మొదటి ప్రాధాన్యత క్రమంలో కొమురవెల్లి కస్తూర్బాను ప్రతిపాదిస్తారని భావించారు. కానీ ఇక్కడ కొనసాగుతున్న దూళిమిట్ట కస్తూర్బాను తరలించడం భారంగా మారుతుందని, విద్యాశాఖాధికారులు కినుక వహిస్తుండటం పట్ల స్థానికుల్లో ఆగ్రహం వ్యక్తమవుతుంది. దూళిమిట్ట కస్తూర్బాను ఇతర భవనంలోకి మార్చి ఇంటర్‌ను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇంటర్‌ను అందుబాటులోకి తీసుకురావాలి



కొమురవెల్లి కస్తూర్బాలో ఇంటర్ విద్య అందుబాటులోకి వస్తే మండలానికి చెందిన ఎంతోమంది విద్యార్థినులకు ప్రయోజనం కలుగుతుంది, పొరుగు ప్రాంతాలకు వెళ్లే భారం తగ్గుతుంది. ఇంటర్ తరగతుల మంజూరు విషయంలో విద్యాశాఖాధికారులు కొర్రీలు పెట్టడం తగదు. నిర్లక్ష్యం వహిస్తే ఆందోళనలు చేస్తాం.

- ఏర్పుల మహేశ్, బీఆర్ఎస్వీ నాయకుడు కొమురవెల్లి

దూళిమిట్టకు వేరే భవనం సమకూర్చాలి



దూళిమిట్ట కస్తూర్బాకు ప్రత్యామ్నాయ భవనాన్ని సమకూర్చి అక్కడికి తరలించే చర్యలను విద్యాశాఖాధికారులు తీసుకోవాలి. కుంటిసాకులతో కొమురవెల్లి కస్తూర్బా అప్‌గ్రేడ్‌ను అడ్డుకుంటే సహించం. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిఉన్న ఈ విషయంపై నిర్లక్ష్యం వీడాలి. ఈ విద్యాసంవత్సరం నుంచి ఇంటర్‌ను అందుబాటులోకి తీసుకురావాలి. లేదంటే డీఈవో కార్యాలయాన్ని ముట్టడిస్తాం.

- దాసరి ప్రశాంత్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి

ఉద్యోగ విరమణ అధికారికి సన్మానం


నాగమణిని శాలువాతో సన్మానిస్తున్న కలెక్టర్

సిద్దిపేట కలెక్టరేట్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార అధికారిగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన పి. నాగమణిని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ మనుచౌదరి శాలువాతో సన్మానించారు. సహకార శాఖలో చిరుద్యోగిగా చేరి అంచెలంచెలుగా జిల్లా సహకార అధికారిగా ఎదిగి 39 సంవత్సరాల సుదీర్ఘ కాలం సేవలు అందించారని కొనియాడారు. మంచి అధికారిగా పేరు తెచ్చుకున్న నాగమణి శేషజీవితం ఆయురారోగ్యాలతో ఉండాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కాగా అదే శాఖలో విధులు నిర్వర్తిస్తున్న నాగేశ్వర్‌రావుకు ఇన్‌చార్జిగా బాధ్యతలను అప్పగించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్యా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్

యూనియన్ బ్యాంక్ నూతన రీజనల్ హెడ్ శ్రీనివాస్ బాధ్యతలు తీసుకున్న అనంతరం బుధవారం కలెక్టర్ మనుచౌదరిని ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. వెంట ఎల్డీఎం హరిబాబు, యూనియన్ బ్యాంక్ డీవై ఆర్ఎం రాఘవ, తదితరులు పాల్గొన్నారు.

శేష జీవితాన్ని ఆనందంగా గడపాలి


ఉద్యోగ విరమణ పొందిన అధికారులతో అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ పొందిన ఉద్యోగులు శేష జీవితాన్ని కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ఆనందంగా గడపాలని అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్ ఆకాంక్షించారు. బుధవారం ఆయన సిద్దిపేట పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఉద్యోగ విరమణ పొందిన గజ్వేల్ ఎస్ఐ పోచమల్ల శంకర్, గౌరారం ఎస్ఐ మహమ్మద్ ఇస్మాయిల్, మద్దూర్ ఎస్ఐ నర్రా విజయ్ కుమార్‌లకు సన్మానపత్రం, మెమొంటో అందజేసి సన్మానించారు.

భూభారతితో పెండింగ్ సాదాబైనామాలకు మోక్షం



సదస్సులో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

రాయపోల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): భూభారతి చట్టంతో పెండింగ్‌లో ఉన్న సాదాబైనామాలకు మోక్షం లభించనున్నదని సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ పేర్కొన్నారు. బుధవారం రాయపోల్ మండలం ఆరేపల్లి రైతు వేదికలో భూభారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన గజ్వేల్ ఆర్డీవో చంద్రకళతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యలకు భూభారతి చట్టంతో సత్వర పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లాలో సుమారు 44వేల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. భూభారతి ద్వారా భూములకు సంబంధించిన సమస్యలను వివిధస్థాయిల్లో తహసీల్దార్‌లు, ఆర్డీవోలు, కలెక్టర్ల ద్వారా పరిష్కారం జరుగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి బాబూనాయక్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో బాలయ్య, ఏవో నరేష్, ఎంపీఓ శ్రీనివాస్, ఆర్ఐ భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ కృషి ఫలితమే జాతీయ రహదారి అలైన్మెంట్ మార్పు


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్

సిద్దిపేట కలెక్టరేట్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): 365 బీ జాతీయ రహదారి అలైన్మెంట్ మార్పునకు కేంద్రం అంగీకరించిందంటే అది పూర్తిగా మెదక్ ఎంపీ రఘునందన్ రావు కృషి ఫలితమేనని సిద్దిపేట బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ తెలిపారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో రైతులతో కలిసి ఆయన మాట్లాడారు. పాత అలైన్మెంట్ ద్వారా దుద్దెడ, ఎన్సాన్‌పల్లి, తడ్కపల్లి, మర్పడగ, బూరుగుపల్లి, ఖమ్మంపల్లి, చిన్న గుండవెల్లి, పుల్లూరు, మల్యాల గ్రామస్థులు తమ భూములు కోల్పోతున్నారని ఎంపీ రఘునాథన్‌రావు ప్రత్యేక చొరవ తీసుకొని జాతీయ రహదారుల శాఖ కార్యదర్శి ఉమా శంకర్ దృష్టికి తీసుకు వెళ్లారన్నారు. అనంతరం అన్ని గ్రామాల రైతులతో కలిసి ప్రెస్ క్లబ్ నుంచి గాంధీ వరకు ర్యాలీగా వెళ్లి ఎంపీ రఘునందన్ రావు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బాణసంచా పేల్చి మిఠాయిలు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు వెంకట్, వేణుగోపాల్, జనార్దన్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి


సిద్దిపేటలోని ఫుట్‌బాల్ స్టేడియంలో శిక్షణ శిబిరానికి హాజరైన విద్యార్థులు

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, ఏప్రిల్ 30: సిద్దిపేట జిల్లా క్రీడా శాఖ పర్యవేక్షణ, ఫుట్‌బాల్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా ఉచితంగా నిర్వహిస్తున్న ఫుట్‌బాల్ వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఫుట్‌బాల్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా కార్యదర్శి అక్బర్‌నవాబ్, జిల్లా క్రీడాశాఖ మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. బుధవారం వారు మాట్లాడుతూ.. సిద్దిపేట పట్టణంలోని ఫుట్‌బాల్ స్టేడియంతో పాటు, గజ్వేల్, ఆర్‌ఆర్ కాలనీ, దుబ్బాక, హుస్నాబాద్‌లో ఫుట్‌బాల్ శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు హరీశ్, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

దూళిమిట్టలో సాఫ్ట్‌బాల్ శిక్షణ శిబిరం

ధూళిమిట్ట, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, యువజన క్రీడలు వారి అధ్వర్యంలో సాఫ్ట్‌బాల్ వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అనుముల కరుణాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 14 సంవత్సరాల లోపు బాలబాలికలకు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ శిబిరాన్ని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరం మే 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఉదయం, సాయంత్రం సమయాల్లో ఉంటుందని తెలిపారు. ఆసక్తి గలవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రగతి కార్యక్రమాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలి

● అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్


అధికారులతో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్

సిద్దిపేట కలెక్టరేట్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రగతి కార్యక్రమాల అమలులో జిల్లాను ప్రథమస్థానంలో నిలిచేలా అధికారులు కృషి చేయాలని అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్ పేర్కొన్నారు. ఉల్లాస్ నవభారత్ సాక్షరతా కార్యక్రమం జిల్లా నీటి, పారిశుధ్య మిషన్‌ల విధివిధానాలపై బుధవారం ఐడీవోసీలోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులకు అదనపు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. మొదటగా ఉల్లాస్ నవభారత్ సాక్షరత కార్యక్రమం గురించి మాట్లాడుతూ.. పాఠశాల విద్యను కోల్పోయిన ప్రతి ఒక్కరికి చదవడం, రాయడం, కనీస సామర్థ్యాలతో కూడిన లెక్కలు చేయడం తదితర అంశాల్లో కనీస జ్ఞానాన్ని అందించడమే ఉల్లాస్ ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ఇందుకోసం జిల్లా కమిటీని ఏర్పాటు చేశామన్నారు. వీరు కనీస విద్య అవసరమైన 5 మండలాలను గుర్తించి, ప్రాధాన్యత క్రమంలో కార్యక్రమాన్ని అమలు చేయడంతో పాటు విజయవంతం చేయడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమాన్ని బడిబాటకు అనుసంధానంగా నిర్వహించాలన్నారు. అనంతరం జిల్లా నీరు, పారిశుధ్య మిషన్‌పై సమీక్షిస్తూ, జిల్లాలోని ప్రతీ గ్రామాన్ని ఓడీఎఫ్ ప్లస్ మోడల్ గా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. గ్రామా ల్లో నీరు, పారిశుధ్యానికి సంబంధించిన సమావేశాలు నిర్వహించాలన్నారు. జిల్లాలో మరుగుదొడ్లు లేని గ్రామాలను గుర్తించి అక్కడ నిర్మించాలని, అనంతరం ఇందిరమ్మ ఇళ్లలో కూడా టాయిలెట్ల నిర్మాణాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ, వ్యర్థాల సేకరణ వాహనాలు, కంపోస్ట్ గుంతలు, జీడబ్ల్యుఎమ్ వ్యవస్థలు, ఎఫ్ఎస్‌డీపీఎస్, గోవర్ధన్ ప్లాంట్ మొదలైన పనులు సక్రమంగా జరగాలన్నారు.

గ్రామ పంచాయతీ భవనాలు, రైతువేదికల్లో కమ్యూనిటీ సోక్ పిట్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ఇకపై జిల్లాలో పంట కోత అనంతరం నిప్పుపెట్టి కాల్చకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈ మిషన్ భగీరథ గిరిధర్, జడ్పీ సీఈవో రమేష్, డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్య, డీపీవో దేవకీదేవి, డీఈవో శ్రీనివాస్ రెడ్డి, వయోజన విద్యాధికారి రామేశ్వర్, జిల్లా వైద్యాధికారి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తదితరులు పాల్గొన్నారు.

సమానత్వాన్ని బోధించిన బసవేశ్వరుడు


గజ్వేల్‌లో బసవేశ్వరుడి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

గజ్వేల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సమానత్వాన్ని బోధించిన గొప్ప వ్యక్తి బసవేశ్వరుడని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలో బసవేశ్వర జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అన్నమయ్య, వేమన తదితరుల రచనలు, బోధనల్లో విప్లవాత్మక మార్పులకు బసవేశ్వరుడే కారణమని తెలిపారు. కార్యక్రమంలో గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ సర్దార్‌ఖాన్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ గాడిపల్లి భాస్కర్, సుఖేందర్‌రెడ్డి, వీరశైవ లింగాయత్ సమాజం సభ్యులు కాస వీరేశం, డాక్టర్ కుమారస్వామి, బాల్‌కుమార్, అమరవాది ప్రభాకర్, గజ్వేల్‌పట్టణ కాంగ్రెస్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మోహన్నగారి రాజు, రాములుగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

● **చేర్యాల:** మండల కేంద్రంలోని సాయిబాబ ఆలయ ప్రాంగణంలో బుధవారం విశ్వగురువు మహాత్మా బసవేశ్వర జయంతిని వీరశైవ లింగాయత్ సమాజం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లింగాయత్ సమాజం చేర్యాల మండల అధ్యక్షుడు బిజ్జ రాము మాట్లాడుతూ.. బసవేశ్వరుని ప్రవచనాలు, సూక్తులు నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి ప్రసాద్, మండల కార్యదర్శి శంకర్, ఉమాపతి, సోమరాజు, రాజమౌళి, కిరణ్, సిద్దమ్మ, పుష్ప ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో మార్కండేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ


మార్కండేయస్వామి పూజలో ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

రాయపోల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ పద్మశాలీ సంఘం నూతనంగా నిర్మించిన ఆలయంలో బుధవారం శ్రీ భక్త మార్కండేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. గత మూడు రోజులుగా ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం ఉదయం వివిధ పూజల అనంతరం యంత్ర ప్రతిష్ఠ, భక్త మార్కండేయ స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని పూర్తి చేశారు. ఉత్సవాల్లో పెద్దసంఖ్యలో భక్తులతో పాటు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రామ మందిర నిర్మాణానికి భూమి పూజ

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లిలో హనుమాన్ల మహేందర్ రెడ్డి సహకారంతో నిర్మించ తలపెట్టిన రామ మందిరానికి బుధవారం గ్రామస్థులు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ రవీందర్ గౌడ్, మాజీ ఎంపీటీసీ నాగుల స్రవంతి ప్రశాంత్ మాట్లాడుతూ గ్రామంలో ఏటా సీతారాముల కల్యాణాన్ని పెద్దఎత్తున నిర్వహిస్తామన్నారు. మందిరానికి భూమి కేటాయించిన ఎమ్మెల్యే హరీశ్‌రావుకు, ఆలయ నిర్మాణానికి సహకరించిన మహేందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత

జగదేవ్‌పూర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మునిగడప గ్రామానికి చెందిన కొత్తపల్లికుమార్ నెల రోజుల క్రితం బ్రెయిన్‌స్ట్రోక్‌తో మృతి చెందాడు. ఎస్సెస్సీ 1995 బ్యాచ్‌కు చెందిన తోటి మిత్రులు అతడి కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించి రూ.23వేలను అందజేశారు. కార్యక్రమంలో ఓంకార్ రాధాకృష్ణ, నాగరాజు, సుధాకర్, మహిపాల్‌రెడ్డి, చందు, బాలరాజు, నరేశ్ ఉన్నారు.

'పది'లో పతనం

(మొదటి పేజీ తరువాయి)

విద్యాబోధన, విద్యార్థుల స్థితి గురించి పరిశీలించలేదనే విమర్శలు లేకపోలేదు. కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు బాగా శ్రమించారు. అలాంటి చోట్ల మంచి ఫలితాలు వచ్చాయి.

దృష్టి పెడితేనే సత్ఫలితాలు..

ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో సిద్దిపేట జిల్లాకు రాష్ట్రంలో 30వ స్థానం దక్కింది. తాజాగా పదోతరగతి ఫలితాల్లోనూ 25వ స్థానంతో సరిపెట్టుకుంది. కీలకమైన ఎస్సెస్సీ ఇంటర్ పరీక్షల్లో ఇలాంటి ఫలితాలు రావడం ఆశ్చర్యానికి గురిచేసింది. అగ్రస్థానంలో ఉన్న ఎస్సెస్సీ ఫలితాలను చూపిస్తూ ఇంటర్ విద్యను బలోపేతం చేయాలని అధికారులు భావించారు. కానీ ఎస్సెస్సీలోనూ అదే పరిస్థితి దాపురించడంతో వారు కూడా తలలు పట్టుకుంటున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో సిద్దిపేట తర్వాత స్థానంలోనే ఉండే మెదక్, సంగారెడ్డి జిల్లాలు మెరుగైన స్థానాలు పొందాయి. సంగారెడ్డి జిల్లా తృటిలో మొదటిస్థానాన్ని కోల్పోయి రాష్ట్రంలోనే ద్వితీయ స్థానాన్ని దక్కించుకుంది. మెదక్ జిల్లా సైతం 12వ స్థానంలో ఉంది. వచ్చే ఏడాదైన జిల్లా విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించాల్సి అవసరం ఎంతైనా ఉంది.

'భూ భారతి'తో శాశ్వత పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. జగదేవ్‌పూర్ మండలం గొల్లపల్లి ఫంక్షన్‌హాల్‌లో భూ భారతి చట్టంపై అదనపు కలెక్టర్ అబ్దుల్‌హమీద్‌తో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా 8వేల లైసెన్స్ కలిగిన సర్వేయర్ల నియామకం చేపట్టనున్నట్లు తెలిపారు. వారి ద్వారా భూమి యొక్క హద్దులు నిర్ణయించి రైతులకు భూధార్ కార్డులు అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. తహసీల్దార్ జారీ చేసిన పాసుపుస్తకాలు లేదా భూధార్‌పై అభ్యంతరాలుంటే రెవెన్యూ డివిజన్ అధికారికి అప్పీలు చేసుకోవచ్చని, రెవెన్యూ డివిజన్ అధికారికి ఇచ్చిన తీర్పుపై అభ్యంతరాలుంటే కలెక్టర్‌కు అప్పీల్ చేసుకోవచ్చని రైతులకు సూచించారు. రాష్ట్ర వ్యాప్తం గా 10,954 మంది రెవెన్యూ అధికారులు నియామకాలు చేపట్టి ప్రతి గ్రామానికీ రెవెన్యూ అధికారిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బట్టు దయానందరెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు భూ సమస్యల పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

హనుమత్ దీక్షా మంత్రమే శక్తిమంతం


భక్తులకు మాలధారణ చేయిస్తున్న స్వామిజీ

సిద్దిపేట కల్చరల్, ఏపిల్ 30 (ఆంధ్రజ్యోతి): హనుమత్ దీక్షా మంత్రమే శక్తిమంతమైనదని అఖిల భారత హనుమాన్ దీక్షా పీఠాధిపతి శ్రీ దుర్గాప్రసాద్ స్వామిజీ పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని శ్రీసంతోషిమాత ఆలయంలో జరుగుతున్న సుందరాకాండ హవనం, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో స్వామిజీ పాల్గొన్నారు. అనంతరం స్వామీజీ భక్తులకు హనుమాన్ మాలధారణ చేయించి, భక్తులకు రామమంత్ర ఉపదేశం చేసి హనుమాన్ అర్ధమండల దీక్షను అందించారు. భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణం చేశారు. హనుమాన్ మాలధారణ భక్తులకు అన్నప్రసాద(భిక్ష) ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు పొడిచేటి రామక్రిష్ణశర్మ, ఆలయకమిటీ పూర్వ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

● సిద్దిపేటలోని గణేష్‌నగర్ శ్రీప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ మాలధారణ భక్తులకు అన్నప్రసాద వితరణ ప్రారంభమైంది. అక్షయ తృతీయ సందర్భంగా బుధవారం ప్రారంభించారు. మాజీమంత్రి హరీశ్‌రావు మాలధారణ స్వాములతో కలిసి భిక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎల్లుపల్లిలో పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం


ఎల్లుపల్లిలో పోచమ్మ సన్నిధిలో హరీశ్‌రావు

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట అర్బన్ మండలం ఎల్లుపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమానికి మాజీమంత్రి హరీశ్‌రావు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ జయశ్రీ రమేష్ ఆధ్వర్యంలో హరీశ్‌రావుకు ఘనస్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠ ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.